గంజాయి సాగు, రవాణా వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-సీలేరు : సీలేరు పోలీస్ స్టేషన్ పరిధిలో గల దారకొండ గ్రామంలో విద్యార్థులు, ఆటో యూనియన్ వర్తక సంఘ నాయకులతో కలిసి గంజాయి సాగు, రవాణాపై, వాటి వలన జరిగే అనర్థాలు, సమాజంలో పెరుగుతున్న దుష్పరిణామాల పట్ల గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీలేరు ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ గంజాయి పంట సాగు, రవాణా మూలంగా అనేక మంది గిరిజనులు జైలు జీవితాలు గడుపుతున్నారని వారు కుటుంబాలకు దూరంగా దుర్భరమైన జీవితాలను అనుభవిస్తున్నారన్నారు. గంజాయి సాగును వీడి ఇకపై అందరూ కూడా సాంప్రదాయ పంటల పట్ల మక్కువ పెంచుకొని జీవన విధానం మెరుగుపరుచుకోవాలన్నారు. అదేవిధంగా విద్యార్థులకు చెడు వ్యసనాలకు దూరంగా ఉండేందుకు తల్లిదండ్రులు నిరంతరం నిఘా పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో దారకొండ గ్రామ పెద్దలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల పాఠశాల గర్ల్స్-2 సమస్యలపై జడ్పీటీసి ఆరా

విశాలాంధ్ర-అనంతగిరి : ఈ సందర్భంగా జడ్పీటీసీ దీసరి గంగరాజు పాఠశాలలో పర్యటించి హాస్టల్లో పరిశీలించి బాత్ రూమ్స్ ప్రధానమైన సమస్యగా ఉన్నది పాఠశాలలో 500 మంది విద్యార్థినిలు ఉండగా 10 బాత్ రూమ్స్ మాత్రమే వినియోగంలో ఉన్నాయి. చాలిచాలని బాత్ రూమ్స్ తో స్నానాలకు,బహిర్ భూమికి వెళ్ళుటకు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. 500 మంది విద్యార్థినులకు 40 బాత్‌రూమ్స్ ఉండవలసిన పాఠశాలలో అరకొర బాత్ రూమ్స్‌తో గడుపుతున్నారు. పాఠశాల సమస్యలు కలెక్టర్ ఎం.ఎస్.దినేష్ కుమార్ దృష్టికి, జిల్లా పరిషత్ చైర్మన్ జల్లిపల్లి సుభద్ర దృష్టికి ఈ పాఠశాలలో 40 బాత్ రూమ్స్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పరిష్కారం చేయాలని కలెక్టర్ ఎం.ఎస్.దినేష్ కుమార్ దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని విద్యార్థినిలకు భరోసా ఇవ్వడం జరిగింది. విద్యార్థినులకు బాగా చదువుకోవాలని సూచించడం జరిగింది ఈ కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు సోమల నాగులు నారాజి సురేష్ బాబుఏ టీడబ్ల్యూఓ వెంకటరమణ మండల విద్యాశాఖ అధికారి కే బాలాజీ ప్రధానోపాధ్యాయురాలు బి మంగమ్మ వార్డెన్ రాజ్యలక్ష్మి గిరిజన సంఘం నాయకుడు నరాజు సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

యాంటీ డ్రగ్‌పై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-పెదబయలు : అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పి అమీత్ బర్దర్ ఉత్తర్వుల మేరకు పెదబయలు మండల యాంటీ డ్రగ్ ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్ఐ జి కుమార్ బాబు, ఆధ్వర్యంలో జీప్ యూనియన్ ఆటో యూనియన్ మరియు జిల్లా పరిషత్ పాఠశాల గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల సెంటెన్స్ స్కూల్స్ విద్యార్థులతో కలిసి గురువారం పోలీస్ సిబ్బంది స్టేట్ బ్యాంక్ జంక్షన్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు గంజాయి వద్దు ఇతర పంటల ముద్దు గంజాయిని తరిమికొడదాం ఆరోగ్యంగా జీవిద్దాం అంటూ పెద్దఎత్తున నినాదాలు చేస్తూ యాంటీ డ్రగ్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై కుమార్ బాబు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో గంజాయి, సారాయి ఇతర చెడు అలవాట్లకు యువత బానిసయ్యారని ఇటువంటి అలవాట్లు వల్ల తమ బంగారు జీవితాల్ని నాశనం చేసుకుంటున్నారని వాటి వల్ల జరిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు ఇటువంటి చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, దేశానికి మన కుటుంబానికి, తల్లి,దండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని విద్యార్థులకు సూచించారు.

విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతపై పరిశీలన

విశాలాంధ్ర-డుంబ్రిగూడ : ఇటీవల అనాధశ్రమంలో కలుషిత ఆహారంతో చిన్నారులు మృతి చెందడంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుంది. దీంట్లో భాగంగానే ఆశ్రమ ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక ప్రాథమికొన్నత పాఠశాలల్లో అమలవుతున్న పోషకాహారంపై విద్య, రెవెన్యూ, ఆరోగ్య, పోలీసు యంత్రాంగం దృష్టి సారించేలా చర్యలు చేపట్టింది. మండలంలోని కిల్లో గుడ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందితోపాటు అల్లూరి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు మధ్యాహ్నం విద్యార్థులకు అమలు చేస్తున్న భోజన మెనూను పరిశీలించారు. వంటగది పరిశుభ్రత కూరగాయల భద్రపరిచే గదుల పరిశుభ్రతపై పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌శాఖ అధికారులు, కిల్లోగూడ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్.వెంకట్రావు, ఉపాధ్యాయుడు సూర్యనారాయణ పాల్గొన్నారు.

నూతన తహసీల్దార్‌గా సుబ్బారావు బాధ్యతలు

విశాలాంధ్ర- మారేడుమిల్లి : మారేడుమిల్లి తహసీల్దార్‌గా కారం సుబ్బారావు గురువారం బాధ్యత లు స్వీకరించారు. కృష్ణ జిల్లా నాగలంక నుండి మారేడుమిల్లి తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. గతంలో ఎటపాక తహసీల్దార్‌గా పనిచేసానని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కరినికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తహసీల్దార్ సుబ్బారావుకి డిప్యూటీ తహసీల్దార్ బాలాజీ, ఆర్ఐ ఏసుబాబు, విఆర్వోలు, సర్వేయర్లు, కార్యాలయ సిబ్బంది శు భాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి

విశాలాంధ్ర-అరకులోయ : మండలంలోని అరకులోయ లోతేరు ప్రధాన రహదారిలో చినలబుడు నాంది సంస్థ సమీపంలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. చొంపి గ్రామానికి చెందిన దేవా సురేంద్ర నాయక్(22),జన్ని మనసై (22) లోతేరు వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా చినలబుడు తురోయిగుడ మలుపు వద్ద ఎదురెదురుగా వస్తున్న బైకులు ఢీకొనడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే ఇద్దరు యువకులు కూడా మృతి చెందారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న అరకులోయ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించి ప్రాథమిక దర్యాప్తు చేపట్టి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా ఇద్దరు యువకులు కుటుంబీకుల ఆవేదన అరణ్య రోదనగా మిగిలిపోయింది. అంది వచ్చిన కుమారులు ఆకస్మికంగా మరణించడంతో కుటుంబీకులు ఆవేదన చెందుతూ కన్నీరు అవుతున్నారు. ఇద్దరు యువకుల మృతితో చొంపి గ్రామం విషాదంగా మారింది.

ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో తిష్ట వేసిన అధికారులను వెంటనే బదిలీ చేయాలి

ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ ప్రభుత్వానికి డిమాండ్

విశాలాంధ్ర-పాడేరు : అల్లూరి జిల్లా పాడేరు నడిబొడ్డున ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో 9 సంవత్సరాలుగా తిష్ట వేసిన, సీనియర్ అధికారులను తక్షణమే బదిలీలు చేయాలని, ఆంధ్రప్రదేశ్ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడ రాధాకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్లూరి జిల్లా పాడేరు నడిబొడ్డున ఉన్న ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయంలో గత 9 సంవత్సరాల నుంచి తిష్ట వేసి ,వేరే ప్రాంతాల్లో బదిలీలు అవ్వకుండా పాడేరు డివిజన్లోనే ఎక్కడో ఒక దగ్గర ట్రాన్స్ఫర్ ఆర్డర్ వేసుకొని, మళ్లీ తాను పనిచేస్తున్న కార్యాలయంలోనే డిప్యూటేషన్ మీద రావడానికి, వేరే ప్రాంతం వారు బదిలీపై ఎవరికి రానివ్వకుండా, ఇక్కడ ఎవరు రావటం లేదంటూ, ముమ్మర ప్రయత్నాలు సాగిస్తున్నారంటే దీంట్లో రహస్యం ఏంటో పైఅధికారులు దృష్టి పెట్టవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.వేరే ప్రాంతాల నుంచి పాడేరు ఆర్డబ్ల్యూఎస్ కార్యలయంలో బదిలీ మీద వస్తున్న అధికారులకు భయభ్రాంతులకు గురిచేసి, ఈ ప్రాంతానికి రానివ్వకుండా అడ్డుకొని, ఈ ప్రాంతం మనసులు మంచివారు కాదు, మీరు ఒక్క క్షణం కూడా డ్యూటీ చేయలేరు అంటూ వారికి భయభ్రాంతులకు గురిచేసి అధికారులతో పైరవీలు చేస్తూ వాళ్లకు రానివ్వకుండా, వీళ్ళ ఇక్కడ తన సొంత జాగిరిలా ఇష్టారాజ్యాంగ వ్యవహరిస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులపై అనేకమార్లు అవినీతి ఆరోపణలు వచ్చిన, ఉన్నత స్థాయి అధికారులు వీటిపై స్పందించకపోవడం గమనార్హం. అదేవిధంగా జి మాడుగుల, జీకే విధి, కొయ్యూరు. ఏళ్ల తరబడిగా పాతుకుపోయిన వీరికి కనీసం స్థానచలనం చేసే పరిస్థితి లేదంటే మనం అర్థం చేసుకోవాలి.గతంలో నీటి పథకాల నిర్వాహకుల టెండర్ లో నిబంధనల ప్రకారం (మైనస్ 26) టెండర్‌కి వెళ్లిన కాంట్రాక్ట్ కి, టెండర్ అవకాశం ఇవ్వాలి కానీ, డి ఇ గారికి బినామీగా ఉన్న (మైనస్ 1) వెళ్లిన కాంట్రాక్టర్ కి టెండర్ దక్కింది. ప్రభుత్వ ఖజానాకి గండి పడిన పర్వాలేదన్న పద్ధతులు ఇక్కడ అధికారులు వ్యవహరిస్తున్నారు. ఈ విషయమై పత్రికల్లో వరస కథనాలు వచ్చినవాటిపై ఎవరు స్పందించకపోవడం ఎంత విచిత్రం అర్థమవుతుంది. 9 సంవత్సరాలుగా ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయంలో తిష్ట వేసి తమ కొనుకూలమైన బినామీ కాంట్రాక్టర్లకు పెట్టుకొని చాప కింద నిరుల బయట ప్రపంచానికి తెలియనివ్వకుండా ఆడిందే ఆట పాడిందే పాట అన్న చందంగా వ్యవహరిస్తున్న ఆర్డబ్ల్యూఎస్ అధికారులపై తక్షణమే వేరే ప్రాంతాలకు బదిలీలు చేయాలని, వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల కార్యదర్శి చంటిబాబు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో మొక్కల పాత్ర కీలకం

ఎన్ఆర్ఈజీఎస్ డిప్యూటీ కమిషనర్ శశిధర్ రెడ్డి

విశాలాంధ్ర-చింతపల్లి : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సరఫరా చేస్తున్న వివిధ జాతుల మొక్కలను సద్వినియోగం చేసుకుని ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణతో పాటు, ప్రాణ వాయువు సమతుల్యత ను కాపాడాలని ఆ పథకం (ఎన్ ఆర్ ఈ జీ ఎస్) డిప్యూటీ కమిషనర్ ఆర్ శశిధర్ రెడ్డి అన్నారు. గురువారం చింతపల్లి, కొయ్యూరు, జీ కే వీధి మండలాల పర్యటన కు వచ్చిన ఆయన ఆ పథకం స్థానిక ఏ పీ ఓ కే లక్మినారాయణమూర్తి తో కలసి ఆ పథకం ద్వారా మండలంలో పంపిణీ జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు పర్యావరణ సమతుల్యతను కాపాడడంలోనే గాక, ప్రాణి కోటికి ప్రాణ వాయువు అందించే ప్రాణ దాత లన్నారు. అటువంటి వృక్ష సంపద వలననే ఈ ప్రాంతంలో కాలానుగుణంగా వర్షాలు కురుస్తున్నాయన్నారు. ప్రాణవాయువుతోపటు నిత్యం నీడనిచ్చే మొక్కలను ఇళ్ల వద్ద పెంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కను నాటడమే గాక దానిని పెంచి పోషించే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలోఈ కార్యక్రమంలో ఆ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ పీ పల్లవి, జనసేన మండల ఉపాధ్యక్షుడు కిముడు కృష్ణమూర్తి (పండు), ఆ పథకం ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా కరక సత్యనారాయణ బాధ్యతలు

విశాలాంధ్ర-రాజవొమ్మంగి : రాజవొమ్మంగి మండలం తహశీల్దార్‌గా కరక సత్యనారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో అల్లూరి దేవిపట్నం మండలంలో పనిచేశాసనని,ఎన్నికల సమయంలో కృష్ణ జిల్లాలో పనిచేశానని, తిరిగి అల్లూరి జిల్లా రాజవొమ్మంగి వచ్చినట్లు తెలిపారు. ఇప్పటివరకు తహసీల్దార్ గా పని చేసిన డిప్యూటీ తహసీల్దార్ అల్లు సత్యనారాయణ ఆయనకు బాధ్యతలు అప్పగించారు.

90% రాయితీపై రాజ్మా విత్తనాలు పంపిణీకి సిద్ధం

విశాలాంధ్ర-ముంచింగిపుట్టు: మండలంలో రబీ సీజన్ ప్రారంభంతో 296 క్వింటాలు రాజ్మా విత్త నాలు 90% రాయితీపై రైతులకు పంపిణీకి సిద్ధం చేశామని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసబాబు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం మండలానికి మొదటి విడతగా ఆరు జోలాపుట్టు మాకవరం, కించాయిపుట్టు కుమడ బంగారుమెట్ట కిలగాడ పంచాయితీలలో గల రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు రాజ్మా విత్తనాలు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. మిగిలిన పంచాయతీ పరిధిలో రెండో విడతలు రాజ్మా విత్తనాలు తెచ్చిన తదుపరి పంపిణీ చేస్తామన్నారు. అర్హులైన రైతులకు రైతు సేవ కేంద్రాల వద్ద వ్యవసాయ ఉద్యాన సహాయకులకు సంప్రదించి విత్తనాలు పొందవచ్చని ఆయన అన్నారు. రాజ్మా విత్తనాలు 50 శాతం మాత్రమే వచ్చాయని, మిగిలిన 50 శాతం విత్తనాలు వచ్చిన వెంటనే మిగిలిన పంచాయతీ పరిధి రైతులకు పంపిణీ చేస్తామని వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌బాబు ఈ కార్యక్రమంలో వ్యవసాయ విద్వాన సహాయకులు పాల్గొన్నారు.

ప్రసవ వేదన.... అరణ్య రోదన

- ఇంకా తప్పని డోలీ మోతలు - కనీస సౌకర్యాలు నోచుకోని గిరి గ్రామాలు
- ఆదివాసీ మహిళల కాన్పు...మరోజన్మే... - అరణ్య ఘోష నివారణెప్పుడో....

విశాలాంధ్ర-కురుపాం : కురుపాం నియోజకవర్గంలో అడవి బిడ్డలు ప్రసవవేదన ఇంకా అరణ్య రోదనగానే ఉంది. అడవి బిడ్డలు పండంటి బిడ్డ కు జన్మ నివ్వాలంటే ఆపసోపాలు పడాల్సిందే. ఏజెన్సీ ప్రాంతంలో సరైన రహదారి సౌకర్యాలు లేకపోవడం,కనీస రహదారి కి దశాబ్దాలుగా నోచుకోక అత్యవసర పరిస్థితుల్లో డోలీ కట్టుకుని కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్లి ప్రాణాలు నిలుపుకోవాల్సిందే... స్వాతంత్ర్యం వచ్చి 78సంవత్సరాలు పూర్తైన ఇంకా కనీస సౌకర్యాలైన త్రాగు నీరు, విద్యా, వైద్యం, రహదారి సౌకర్యాలు నోచుకోక అవస్థలు పడుతున్నారు. ఇంకెన్నాళ్ళు మాజీ కష్టాలు అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కొమరాడ మండలంలోని గాజులు గూడ గ్రామానికి చెందిన హిమరిక రజనీ నిండు గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో రావడంతో గత్యంతరం లేక బంధువులు మంచానికి డోలీ కట్టుకుని రెండు కిలోమీటర్ల దూరం కెమిశీల వరకు మోసి అక్కడ నుంచి కూనేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 108లో తరలించారు.ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ గ్రామానికి శాస్వత రహదారి నిర్మాణం జరుగలేదని కూటమి ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఎన్నికలు హామీ తక్షణమే అమలు చేయాలని రహదారి నిర్మాణం చేపట్టాలని గాజులు గూడ గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ఇలా కనీస సౌకర్యాలు నోచుకోని గిరిజన గ్రామాలు అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక తయారు చేసి గిరిజనుల ప్రాణాలు కాపాడాలని కోరుతున్నారు.

జనవరి నాటికి ఓటరు నమోదు పూర్తి చేయాలి : రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలోని ఇంటింటి ఓటర్ సర్వే 2025 జనవరి నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి జిల్లా అధికారులను ఆదేశించింది. గురువారం అన్ని జిల్లాలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓటరు నమోదు కార్యక్రమం గూర్చి వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి మాట్లాడుతూ వచ్చే జనవరి 1 నాటికి జిల్లాలో ఇంకా నమోదు కాని యువ ఓటర్ల నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు. సెప్టెంబర్ 21లోగా ఇంటింటి సర్వే బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఓ)పూర్తి చేయాలని పేర్కొన్నారు. 28 తేదీ నాటికి అభ్యంతరాలను అప్డేట్ చేయాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహనా కల్పించాలని తెలిపారు. పోలింగ్ స్టేషన్ల క్రమబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బూత్ లెవల్ అధికారులకు (బిఎల్ఓ), ఓటరు నమోదు అధికారులు, సహాయ నమోదు అధికారులు అవసరమైన శిక్షణలు ఇవ్వాలన్నారు. బిఎల్ఓలు శతశాతం ఇంటింటి సమాచారాన్ని సేకరించాలని సూచించారు. అక్టోబర్ నాటికి అర్హత ఉండి నమోదు కాని వారికి ఓటరుగా నమోదు చేసుకునెలా ప్రోత్సహించాలని తెలిపారు. యువ ఓటర్ల నమోదు శాతం తక్కువగా ఉందని, నమోదు శాతం పెరగాలని అన్నారు. చనిపోయిన ఓటర్లు, శాశ్వతంగా బదిలీ చేయబడిన ఓటర్లను పక్కాగా గుర్తించాలని ఎన్నికల అధికారులు అన్నారు. సాలూరు, పాలకొండలలో ఒకటి, రెండు శాతం నూతన ఓటరు నమోదు జరిగిందని, మిగిలిన నియోజకవర్గాల్లో నమోదు జరగలేదని, నూతన ఓటర్లు నమోదు చేసుకునే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈవీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక, జిల్లా రెవిన్యూ అధికారి జి. కేశవ నాయుడు, పార్వతీపురం రెవిన్యూ డివిజనల్ అధికారి కె. హేమలత, పాలకొండ రెవిన్యూ డివిజనల్ అధికారి వి. వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ గ్రామసభలు విజయవంతం చేయండి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కురుపాం : రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవనకళ్యాణ్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తూ ఇచ్చిన ఆదేశాలమేరకు గ్రామ సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించే గ్రామసభలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. గ్రామసభలో ముఖ్య అంశాలు 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రతిపాదనలు , ఇప్పటికీ మంజూరు కాబడిన, పురోగతిలో ఉన్న పనులను ప్రస్తావించడం, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వేతనాలు కోరే హక్కు, అర్హతలపై అవగాహన, సోషల్ ఆడిట్ ప్రాముఖ్యతపై అవగాహన, లైన్ డిపార్ట్మెంట్‌కు సంబంధించిన పనులను గ్రామ సభలో చేర్చడం, అమలు చేయడం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని మరియు అభివృద్ధి కార్యక్రమాలను గ్రామసభలో ప్రస్తావించాలి. కావున ప్రతి గ్రామ పంచాయతీలో కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రజలందరూ ఈ కార్యక్రమానికి హాజరవ్వాలని కోరారు.

ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు ప్రతినెలా జీతాలు చెల్లించేలా చూడాలి

మంత్రిని కోరనున్న ఏఐటీయూసీ

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా ఆసుపత్రులలో పనిచేస్తున్న పారిశుద్ధ్యం, భద్రతా, చెద పురుగుల నివారణ కార్మికులకు, సూపర్ వైజర్లకు జీతాలు ప్రతీ నెలా చెల్లించేటట్లు చేయాలని జిల్లా పర్యటనకు వస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ను కోరుతున్నామని ఏఐటియుసి జిల్లా కార్యదర్శి ఆర్వీఎస్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో ఏరియా ఆసుపత్రులు, సామాజిక ఆసుపత్రులు కలిపి 122 మంది కార్మికులు ఉన్నారని వీరు టివిటి, స్కాట్లాండ్ గ్రూపు ఏజెన్సీలో పని చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైద్య సంస్థలైన వైద్య కళాశాలలు, భోదనా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు, ప్రాంతీయ ఆసుపత్రులు, సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రాలలో పారిశుద్ధ్యం, భద్రతా, చెద పురుగుల నివారణ నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల అరాచకాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందని, 3 నెలలకు ఒకసారి జీతాలు చెల్లింపులు, పిఎఫ్ బకాయి మరియు దోపీడీలు, ఈఎస్ఐ కార్డులు అందజేయకపోవడం ఇలా కార్మికుల శ్రమ దోపిడికి గురౌతున్నారన్నారు. ఆసుపత్రిలోని వర్కర్లు ఆసుపత్రులను పరిశుభ్రంగా ఉంచుతూ రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటున్నారని కానీ వారికి జీతాలు సకాలంలో సక్రమంగా ఇవ్వకపోవడం వలన ఆ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని కావున వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వారి ఇబ్బందులను తొలగించాలని మంత్రి గారిని కోరుతున్నామన్నారు. ఈసందర్భంగా జిల్లాకు విచ్చేస్తున్న మంత్రి గార్కి ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులకు ప్రతీ నెలా జీతాలు చెల్లించేటట్లు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేయడం జరుగుతుందని తెలిపారు.

ప్రాథమిక ఆసుపత్రిని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సందర్శన

విశాలాంధ్ర-సీతానగరం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయ పార్వతి, ఐటీడీఏ డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తెర్లి జగన్మోహన్, జిల్లా మలేరియా అధికారి మణిలు గురువారం సాయంత్రం సందర్శించారు. శుక్రవారం నాడు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య ప్రసాద్, సీతానగరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించడంతోపాటు మరిపివలస గ్రామంలో ఎస్సీ ఎస్టీ లబ్ధిదారులతో మాట్లాడనున్న నేపథ్యంలో వారు సందర్శించి పలు సూచనలు చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. అన్ని ఏర్పాట్లు చేయాలని కోరుతూ రికార్డుల నిర్వహణ ,పనితీరు తదితర అంశాలపై ఆరాతీశారు. ఈకార్యక్రమంలో ఈఓపిఆర్డీ కుమార్ వర్మ, వైద్యులు ఉషారాణి, పావని వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి రాకతో ఆసుపత్రి దశ మారేనా... రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శన నిమిత్తం వస్తుందందున ఇప్పటికైనా ఈ ఆసుపత్రి దశ మారుతుందా లేదా అన్నది చూడాలి. ఇప్పటికేఆసుపత్రి భవనం శిథిలావస్థ స్థితికి చేరుకోవడంతో సిబ్బంది బితుకు బితుకుమని ఉంటున్నారు. నాడు నేడు ద్వారా కోటి 26లక్షల రూపాయలతో నిర్మిస్తున్న కొత్తభవనం పనులు మధ్యలో నిలిచిపోయాయి. సగం పనులు పూర్తయ్యాక గుత్తేదారు పరారు కావడంతో ఆ పనులు పూర్తిచేసేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఇప్పటికే ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర అధికారులను ఆదేశించారు. దీనిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా మంత్రిగారు స్పందించి దీనిపై తగుచర్యలు తీసుకొని సత్వరమే పనులు ప్రారంభించి వైద్యులు, వైద్య సిబ్బంది, రోగులు ఉండేందుకు తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజానీకం కోరుతుంది.

గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖపై విజిలెన్స్ దర్యాప్తు చేయాలి

ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం డిమాండ్

విశాలాంధ్ర-కురుపాం : పార్వతీ పురం ఐటిడిఏ పరిధిలోని గిరిజన ఇంజనీరింగ్ శాఖ పై విజిలెన్స్ దర్యాప్తు చేయాలని ఏపి గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరిక చంద్ర శేఖర్ డిమాండ్ చేశారు.బుధవారం ఆయన మాట్లాడుతూ సస్పెండ్ కాదు ఆ అధికారులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అలాగే విజిలెన్స్ సమగ్రమైన దర్యాప్తు చేపట్టాలని ఇతర అక్రమాలు గుర్తించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.పార్వతీపురం ఐటిడిఏ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న ముగ్గురు అధికారులు ఫోర్జరీ సంతకాలతో గిరిజన నిధులను దుర్వినియోగం పాల్పడిన అధికారులకు సస్పెండ్ కాకుండా వారి పైన ,క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదివాసీ గిరిజనాభ్యుదయ సంఘం తరపున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

నేడు ఉపాధి పథకం గ్రామసభలను సక్రమంగా నిర్వహించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-పార్వతీపురం : ఉపాధి హామీ పనుల ఆమోదం కోసం ప్రతి గ్రామ పంచాయతీలో శుక్రవారం గ్రామసభలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గురువారం మండల ప్రత్యేకఅధికారులు, ఎంపిడిఓలు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రామసభలపై పలు సూచనలు చేశారు. గ్రామసభల్లో గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు కూడా పాల్గొనేలా మండల అభివృద్ధి అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు వీలున్నంత ఎక్కువ గ్రామసభలకు హాజరు కావాలని సూచించారు. గ్రామసభల కార్యక్రమాలన్నీ వీడియోగ్రఫీ చేయాలని, ఎక్కడ ఎలాంటి పొరపాటు జరగకుండా, సభలు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఉపాధిహామీలో ప్రస్తుతం జరుగుతున్న పనులను, భవిష్యతు లో చేపట్టబోయే పనులను కూడా తెలియజేయాలని తెలిపారు. వ్యవసాయ అనుబంధంగా జరిగే పనులకు, ఉద్యానవనాలకు ప్రాధాన్యత నివ్వాలని తెలిపారు. గ్రామ స్థాయిలో సంబంధిత సిబ్బంది అందరూ విధిగా పాల్గొనాలని ఆయన ఆదేశించారు.

ప్రశాంతంగా ముగిసిన డీఎస్సీ ఎంపిక పరీక్ష

విశాలాంధ్ర-సీతంపేట: ఐటిడిఏ పరిధిలో గల వైటిసి కేంద్రంలో డీఎస్సీ.ఉచిత శిక్షణ కోసం నిర్వహించిన పరీక్షకు 422 మందికి గాను 380 అభ్యర్థులు హాజరైనారు. ఈ పరీక్ష అర్హత సాధించిన 200 మందికి ఉచిత శిక్షణ ఇవ్వబడును తెలిపారు. ఈ పరీక్ష నిర్వహణ కార్యక్రమంలో ఏపీవో చిన్న బాబు, డిడి అన్నాదొరై, డిప్యూటీ ఈవో నారయుడు, ఏఎంఓ కోటి బాబు, జిసిడిఓ రాములమ్మ, కోఆర్డినేటర్ ముకుంద, హెచ్ఎంలు సూర్యం, భాస్కరరావు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణతే ధ్యేయంగా పనిచేయండి

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలోని ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు శతశాతం ఉత్తీర్ణత అందించే విధంగా ప్రతి ఉపాధ్యాయుడు నిబద్ధతతో పనిచేసి విద్యార్థిని విద్యార్థులకు పాఠ్యాంశాలపై అవగాహన కల్పించి మంచి తర్ఫీదు ఇవ్వాలని మండల విద్యాశాఖ అధికారి-2 ముడిలి శ్రీనివాసరావు కోరారు. గురువారం మండల కేంద్రంలోఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో వారి విద్యా ప్రమాణాలపై ఆయన అడిగి తెలుసుకున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థినీ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు ఆయన సూచించారు. వారాంతపు, మాశాంతపు పరీక్షలు నిర్వహించి మెరుగైన ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గెడ్డ నీటిప్రవాహం తొలగింపు చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: కాస్తంత వర్షం పడగానే బెలగాం గెడ్డ నీటి ప్రవాహం పెరగడం వలన చుట్టుపక్కల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని, వెంటనే తగిన చర్యలు చేపట్టాలని సిపిఎం పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ సభ్యులు ఎం. కృష్ణమూర్తి అన్నారు. గురువారం పార్వతీపురం స్థానిక మున్సిపల్ కమిషనరుకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ గెడ్డ నీటి ప్రభావం పెరిగిపోవడం వల్ల తన సొంత దారిలో వెళ్లలేక ఉత్తర దిశగా గట్టును కొట్టేసి చైతన్య స్కూల్కు, బిఎస్ అపార్ట్మెంట్కు, ఆ పక్కనే ఉన్న బిఎస్ నగరుకు నీటి ప్రవాహము పెరిగి రోడ్డుపై మోకాలు లోతు వరకు నీరు ప్రవహించడంతో విద్యార్థులు సిబ్బంది ఉద్యోగులు ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. అక్కడ నివాసం ఉన్నటువంటి ప్రజలకు మరీ ఇబ్బందిగా ఉందని అదేవిధంగా మహాత్మ జ్యోతిరావు పూలే బాలికల పాఠశాలకు, మెయిన్ రోడ్డుకు తూర్పున ఉన్న అపార్ట్మెంట్ లోకి నారాయణ శ్రీ సీజన్ స్కూల్ లకు కూడా నీరు వెళ్తున్నందున ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. కావున, మెయిన్ రోడ్డు దిగువన గల కాలువలో అడ్డుకట్టగా ఉన్న చెత్తను తొలగించాలని, ఉత్తర వైపున పెద్ద వ్యాపారాల కొరకు ఒక కాలువను సన్నగా తీర్చిదిద్దే ప్రయత్నం చేయడం వల్ల నీటి ప్రభావము మెయిన్ రోడ్డు వైపుకు చేరుకుంటుందని, వాటిపై దర్యాప్తు జరిపి అక్రమాలకు పాల్పడినట్లయితే తగిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బంకురు సూరిబాబు, పి. రాజశేఖర్ పాల్గొన్నారు.

వయ్యారి భామ మొక్కల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి

వ్యవసాయ పరిశోధన స్థానం సహసంచాలకుడు డాక్టర్ అప్పలస్వామి

విశాలాంధ్ర-చింతపల్లి : వ్యవసాయ పంటలకు నష్టం వాటిళ్ళ చేయడమే గాక, ఆరోగ్య సమస్యలను కలిగించే వయ్యారి భామ మొక్కల నిర్మూలనకు ప్రతి ఒక్కరు నడుం బిగించాలని చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం సహ సంచాలకుడు డాక్టర్ అప్పలస్వామి అన్నారు. 19వ వయ్యారి భామ అవగాహన వారోత్సవ(16-22) ముగింపు కార్యక్రమం స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆర్ ఏ ఆర్ ఎస్, పాలిటెక్నిక్ విద్యార్థులు, సిబ్బంది 3 కిలో మీటర్ల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చుంచుంపూడి గ్రామంలో ఉన్న వయ్యారి భామ కలుపుని రైతులతో కలసి నిర్మూలించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఈ వయ్యారిభామ మొక్కలు ఎక్కడున్నా వాటిని వెంటనే తొలగించాలని, తొలగించిన మొక్కలను గుంతలో వేసి ఎరువుగా మార్చుకోవచ్చని వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు, రైతులకు అవగాహన కల్పించారు. ఈ వయ్యారిభామ మొక్కలను నిర్మూలన చెయ్యక పోవడం వలన వచ్చే ఆరోగ్య సమస్యలను గురించి, అదే క్రమంలో ఆ మొక్కల వలన వ్యవసాయ పంటలకు జరుగు నష్టం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు డా. కె. బయ్యపు రెడ్డి, డా. పి. బలాహుస్సేన్ రెడ్డి, డా. సీదరి ఉజ్వల రాణి, పాలిటెక్నిక్ విద్యార్థులు, సిబ్బంది కె. బాబుజీ నాయుడు, ఎస్. శ్వేత, కె. అన్న పూర్ణ, ఆర్. ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు

విశాలాంధ్ర-అనంతగిరి : మండలంలో పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు పశుసంవర్ధక సహాయకుల ద్వారా విస్తృతంగా ఈనెల 20 తారీఖు నుండి సెప్టెంబరు 18 వరకు వెయ్యడం జరుగు తుందిని కాశీపట్నం పశు వైద్యాధికారి సాగరి గణేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఈ వ్యాధి సోకిన గర్భస్థ పశువులు ఈసుకుపోతాయి మరియు పాలిచ్చే పాడి ఆవుల పాల దిగుబడి తగ్గిపోతుందిని పాడి రైతులకు అపారమైన ఆర్థిక నష్టం జరుగుతున్న దృష్ట్యా ఈ వ్యాధిని 2030కి పూర్తిగా అరికట్టాలనే ఉద్దేశంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏట రెండు పర్యాయాలు పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమం చేపట్టడం జరుగుతుందినీ దీనిలో భాగంగా ఈరోజు జీనాబాడు పంచాయతీ జీనాబాడు గ్రామంలో 64 పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వెయ్యడము జరిగిందని పాడి రైతులకు గాలికుంటు వ్యాధి లక్షణాలు, తీసుకోవలసిన జాగ్రత్తలు, నివారణ చర్యల గురించి అవగాహన కల్పించమన్నారు. ఈ అవకాశాన్ని రైతు సోదరులందరూ వినియోగించుకోవలసిందిగా కోరామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి పినకోట గ్రామీణ పశు వైద్యశాల జూనియర్ వెటర్నరీఅధికారి సుధావాణి మరియు పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2వ ఫేజ్ ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

విశాలాంధ్ర-చింతూరు : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024- 25 విద్యా సంవత్సరానికి 2వ ఫేజ్ డిగ్రీ ఆన్లైన్ అడ్మిషన్స్ ప్రక్రియ ప్రారంభం అయినదని కళాశాల ప్రిన్సిపల్ డా.కె.రత్న మాణిక్యం తెలియజేశారు. రెండవ ధఫా షెడ్యూల్ లో భాగంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ఆఖరి తేదీ 24-08-2024, వెబ్ ఆప్షన్ నమోదు చేసుకోవడానికి 23-08-2024 నుండి 25-08-2024 వ తేదీ వరకు, సీట్లు కేటాయింపులు 29-8-2024 వ తేదీన జరుగుతాయని ఒక ప్రకటనలో తెలియజేశారు. చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సకల బోధన సదుపాయాలతో, అత్యున్నత విద్యా అర్హతలు అనుభవజ్ఞులైన బోధన సిబ్బంది కలిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు బిఏ ఆనర్స్ ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, బీకాం ఆనర్స్ కంప్యూటర్ అప్లికేషన్స్, కామర్స్, బిఎస్సి ఆనర్స్ ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, కంప్యూటర్ సైన్స్, జువాలజీ, బోటనీ నందు కోర్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్పొరేట్ స్థాయిలో అన్ని హంగులతో డిగ్రీ కోర్సులు చదవడానికి అనువైన ప్రశాంతమైన వాతావరణం కళాశాలలో ఉన్నదనీ, ఇంటర్ పాసైన విద్యార్థినీ విద్యార్థులు కళాశాలకు వచ్చి కళాశాలలోనే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగిందని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. 99492 29236, 99512 37879, 81068 72474. నెంబర్లను సంప్రదించాలని కోరారు.

శిశు సంరక్షణ కేంద్రాలను ఐసీడీఎస్ తనిఖీ

విశాలాంధ్ర-పార్వతీపురం : కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి ఎంఎన్ రాణి ఆధ్వర్యంలో శిశు సంరక్షణ కేంద్రాలను, అనాధ శరణాలయాలను ఐసిడిఎస్ అధికారులు, జిల్లా బాలల సంరక్షణ విభాగం సిబ్బంది గురువారం తనిఖీలు నిర్వహించారు. పార్వతీపురంలో గల శిశు గృహ, బాలసదనం, లచ్చయ్యపేటలో గల బాలల సంరక్షణ కేంద్రాలను తనిఖీలు నిర్వహించారు. ఈ అనాధాశ్రమాల్లో పిల్లలకు అందిస్తున్న ఆహారము మరియు తాగునీరు వసతి, విద్య ఆరోగ్యం రక్షణ భద్రత విషయాలను పరిసరాల పరిశుభ్రతను మరియు రికార్డులను పరిశీలించారు. యాక్ట్ ప్రకారంగా అనుమతులు తీసుకున్నది లేనిది ఈబృందం తనిఖీ చేశారు.అనుమతి లేకుండా ఆశ్రమాలను నడపకూడదని స్పష్టం చేశారు. తప్పనిసరిగా అనాధాశ్రములు అనుమతులు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం అన్ని సౌకర్యాలను కల్పించాలని ఆదేశించారు. జిల్లా కన్వీనర్గా డిపిఓ వి.వి రవికుమార్, జిల్లా కో కన్వీనర్ గా జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ, కమిటీ సభ్యులుగా ఐసీడీఎస్ పిఓ ఎన్ ప్రసాదరావు, ఎంఎ నాయుడు పిఓ ఎస్ఐసీ, పి శ్రీధర్ లీగల్ కం ప్రొఫెషన్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మి కుమార్తెని ఆశీర్వదించిన తెదేపా రాష్ట్ర నాయకులు

విశాలాంధ్ర-కొయ్యూరు : నూకరాజు వరలక్ష్మి దంపతుల కుమార్తె సంధ్యారాణిని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమేలీ చిట్టిబాబు రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వహణ కార్యదర్శి కోడా వెంకట సురేష్ కుమార్‌లతో పాటు కె.కృష్ణా రావు, కొంతెలీ వెంకట ప్రసాద్, చంటిబాబులు పెళ్లి విందుకర్యక్రమానికి హాజరై అక్షింతలతో నిండు నూరేళ్లు ఆయుస్ ఆరోగ్యాలతో వర్ధిల్లాలని ఆశీర్వదించరు. ఈ కార్యక్రమంలో నక్క రాంబాబు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై వర్క్‌షాపు నిర్వహణ

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి ప్రకృతి వ్యవసాయంతోనే సాధ్యం
జిల్లా వ్యవసాయ అధికారి రాబర్ట్ పాల్

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో ప్రకృతి వ్యవసాయం విస్తీర్ణం పెంచేందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని జిల్లా వ్యవసాయఅధికారి కె.రాబర్ట్ పాల్ తెలిపారు. గురువారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశాలతో మండల వ్యవసాయ అధికారులకు, ప్రకృతి వ్యవసాయ సహాయకులు, సిఎన్ ఎఫ్ సిబ్బందికి వ్యవసాయశాఖ,రైతు సాధికార సంస్థలు సంయుక్తంగా జిల్లా స్థాయి వర్కుషాపును నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి పాల్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వలన లాభాలు, సాగు విధానాలు, నవధాన్యాలు జల్లుట వలన కలిగే ఉపయోగాలను, తక్కువ ఖర్చుతో అధిక దిగబడి సాధించే విధానం తదితర అంశాలపై వర్కుషాప్‌లో వివరించారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అదికారి రాబర్ట్ పాల్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. ఈనెల 9న విజయవాడలో రాష్ట్ర స్థాయి వర్కుషాప్ నిర్వహించారని, ఈ వర్కుషాప్ ద్వారా తెలుసుకున్న విషయాలను మండలంలోగల వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలని తెలిపారు. రైతులను సంపన్నులుగా మార్చడమే లక్ష్యంగా వ్యవసాయ విధానాలు రూపొందించాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఖర్చు,రాబడి వివరాలు నమోదుచేయాలని తెలిపారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయం విస్తీర్ణం పెంచాలని, ప్రతి రైతుసేవాకేంద్రాల పరిధిలో కనీసం ఒక ఎకరా భూమిలో ప్రకృతి వ్యవసాయం ప్రారంభించాలన్నారు. ప్రతి సంవంత్సరం సాగు విస్తీర్ణం పెంచుకుంటూ వెళ్లాలని, అయిదు సంవత్సరాలలో కనీసం 40 శాతం ప్రకృతి వ్యవసాయం విధానాలలో సాగుచేసే విధంగా కృషిచేయాలని తెలిపారు. ప్రస్తుతం రసాయనాల ద్వారా సాగుచేస్తున్న పంటలలో మనిషికి కావలసిన రోజువారీ పోషకాలు తగ్గిపోయాయని, వాటిని భర్తీ చేయాలంటే ప్రస్తుతం తీసుకుంటున్న ఆహారానికి రెండు రెట్లు మాంసాహారం, మూడు రెట్లు పండ్లు, అయిదు రెట్లు ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవాలని శాస్త్రవేత్తలు తెలిపారన్నారు. పోషకాలు అందక వ్యాధినిరోధకత, శరీర పటుత్వం తగ్గిపోవుట వలన త్వరగా అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రోగ్రాం మేనేజరు పి.షణ్ముఖరాజు వర్కుషాప్ లో వివిధ అంశాలను వివరిస్తూ ప్రకృతి వ్యవసాయంలో ఆరోగ్యమైన భూమిని, ఆరోగ్యమైన పంటని సాధించి తద్వారా ఆరోగ్యమైన జీవితాన్ని అందించడమే లక్ష్యంగా కృషిచేస్తున్నట్లు తెలిపారు. ఈవిధానంలో భూమిని దున్నకూడదని, ఎప్పుడూ భూమిపై పచ్చదనం ఉండేలా చూడాలని తెలిపారు. భూమి సారవంతమగుటకు నవధాన్యాలను భూమిలో, పండ్లతోటలమధ్యన జల్లాలని తద్వారా భూమిలో ఆరోగ్యవంతమైన బాక్టీరియా వృద్ధి చెందుతుదని తెలిపారు. భూమిలో తేమశాతం పెరుగుతుందని, భూమి గుల్లబారుతుందని, వానపాములు వృద్ధి చెంది సారవంతమౌతుందని తెలిపారు. రసాయనాలు, పురుగు మందులు వాడకం తగ్గించే విధంగా రైతులలో అవగాహన కల్పించా లని, తద్వారా పెట్టుబడివ్యయం తగ్గుతుందన్నారు. నవధాన్యాల పంటను పశువులకు దాణాగా వినియోగించుకోవచ్చునని, తద్వారా వాటికి కూడా కావలసిన అన్నిపోషకాలు అంది నాణ్యమైన పాలను అందిస్తా యన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పెంచిన చెట్లఆకులు నీటిని పీల్చుకొనే గుణం కలిగిఉంటాయని, రసాయనాలు వాడిన చెట్ల ఆకులలో ఆ సామర్థ్యంలేదని శాస్త్రవేత్తలు గుర్తించారన్నారు. ఎల్లప్పుడూ ఏదో ఒక పంట దిగుబడి వచ్చే విధంగా వ్యవసాయ క్షేత్రాలను రూపొందించాలని, తద్వారా ఏడాది పొడవునా రైతుకు ఆదాయం వస్తుందని తెలిపారు. ఎరువులు, రసాయనక మందులు వినియోగం తగ్గించి, ప్రకృతి వ్యవసాయం పండించే విధంగా కృషి చేయాలన్నారు. ఏ రకమైన ఎరువులు, రసాయనక మందులు వాడకుండా ప్రకృతి వ్యవసాయం సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన పంటలు యొక్క ఉపయోగాలను ప్రజలకు తెలియాలన్నారు. కరపత్రాలు, పుస్తకాలు, వీడియోలు ద్వారా ప్రకృతి వ్యవసాయం సాగును పెంచేందుకు ప్రజలలో చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం ఏడిఏ టి. వెంకటేష్, కె. శ్రీనివాస్, డి.భరత్, పాలకొండ ఏడిఏ కె. రత్నకుమారి, సాలూరు ఏడిఏ యం.మధుసూదన్, జిఎల్ పురం ఏడిఏ నిర్మలాజ్యోతి,15మండలాల మండల వ్యవసాయ అధికారులు, కమ్యూనిటీ సహజ వ్యవసాయాన్ని నిర్వహించించే అన్ని క్యాడర్ల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అనధికార లేఔట్లు, అక్రమ కట్టడాలపై విజిలెన్స్ కన్ను

- అనధికార లేఔట్లపై మున్సిపల్, బుడ అధికారుల చర్యలు శూన్యం
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న అధికారులు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: గత ప్రభుత్వం రాష్ట్రంలో జిల్లాలను పెంచే ఆలోచనలో భాగముగా పార్వతీపురం మున్సిపాలిటీని జిల్లా కేంద్రముగా ప్రకటించిన విషయం అందరికీ తెలిసిందే.అయితే ఇదే అదునుగా జిల్లా పేరు చెప్పుకొని రియల్ ఎస్టేట్ బడా బాబులు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు పొందకుండానే, నిబంధనలు పాటించకుండానే అనధికార లేఔట్లను వేసి మూడు అనధికార లేఔట్లు, ఆరుఅక్రమ నిర్మాణాలుగా వారి వ్యాపారాలను కొనసాగించుకుంటున్నారు.పార్వతీపురం పట్టణ నడి బొడ్డులో ఇటువంటి నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు వీటివైపు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న శైలి పలు అనుమానాలకు దారితీస్తుంది.ఇక అక్రమ లేఔట్ల విషయానికి వస్తే మున్సిపాలిటీకి ఆనుకొని ఉన్న కొత్తవలస సర్వేనెంబర్ 125 లో 3.69 ఎకరాల్లో గల వెంకటరమణ రియల్ ఎస్టేట్, అలాగే బెలగాం ప్రాంతంలోని 458/1బిలో 2.56 ఎకరాలలో ఉన్న సాయి గార్డెన్ డెవలపర్స్ కు సంబంధించిన లే ఔట్లకు ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేవని సాక్షాత్తు మున్సిపల్ అధికారులే పత్రికా ముఖంగా విషయాన్ని తెలియజేసినప్పటికీ ఈ లేఔ ట్లపై నేటికీ బుడా అధికారులు గానీ,మున్సిపల్ అధికారులు గానీ ఎటువంటి ప్రభుత్వపరమైన చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటో అని పలువురు ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తున్నారు. ఇక అక్రమ నిర్మాణాలు విషయానికి వస్తే కోకొల్లలుగా ఉదాహరణలు చెప్పుకోవచ్చు.మున్సిపల్ కార్యాలయానికి కనుచూపుమేరలో ఉన్న హోటల్ శ్రీకాంత్ వెనుక భాగంలో నిర్మాణం చేపడుతున్న ఐదు అంతస్తుల భవనానికి మున్సిపాలిటీకి చెల్లించవలసిన 14 శాతం ఫీజు చెల్లించకుండానే భవన నిర్మాణానికి సంబంధిత అధికారులు అనుమతులు మంజూరు చేశారని,అదే ప్రాంతంలో 30 అడుగుల రోడ్డు ఉండాలన్న నిబంధన ఉన్నప్పటికీ కేవలం 18 అడుగుల రోడ్డులోనే ఐదు అంతస్తుల భవన నిర్మాణానికి అనుమతులను సంబంధిత శాఖ వారు ఎలా మంజూరు చేశారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఈ ప్రాంతంలోనే సాయిబాబా గుడికి ఆనుకొని ఒక అపార్ట్మెంట్, బైపాస్ రోడ్ లో గల పెట్రోల్ బంక్ కి అనుకొని ఒక అపార్ట్మెంట్ నిర్మాణం లోనూ, సాక్షాత్తు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ప్రముఖ వ్యాపారి నిర్మాణం చేస్తున్న భవనముకి కూడా అదనపు అంతస్తు నిర్మించుకునేందుకు అధికారులకు చేతులు తడిపారన్న విషయం పట్టణంలో వినిపిస్తోంది.ఇదిలా ఉండగా రైల్వే ట్రాక్‌కు ఆనుకొని 100 అడుగుల వరకు ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదన్న నిబంధనలు ఉన్నప్పటికీ కొంతమేర నిర్మాణానికి ప్లాన్ మంజూరుచేసి మిగతా నిర్మాణానికి చూసిచూడనట్లు వ్యవహరించేందుకు ఒక యజమాని వద్ద లక్షల్లో నగదు మున్సిపాలిటీలోని సంబంధిత విభాగ అధికారులకు ముట్ట చెప్పినట్లు వినికిడి. ఈ నిర్మాణం విషయంలో నేటికీ సంబంధిత యజమానికి మున్సిపాలిటీ ద్వారా నోటీసు కూడా ఇవ్వకపోవడం చూస్తే అధికారులు ఏ మేర చేతివాటం చూపిస్తున్నారో ఇట్టే అర్థమవుతుంది.ఈ అక్రమ నిర్మాణాలు,అనధికార లే ఔట్ల పై ప్రజా సంఘాల నాయకులు సంబంధిత అధికారులకు ఎన్ని మార్లు చర్యలు నిమిత్తం వినతి పత్రాలు అందించిన ఫలితం శూన్యం కావడంతో ఈ విషయాన్ని విజిలెన్స్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఫిర్యాదు చేసినట్లు తెలియ వచ్చింది.ఈ విషయంపై విజిలెన్స్ అధికారులు ఏమేర చర్యలు చేపడతారో వేచి చూద్దాం.

నేడు ఉపాధి హామీ పథకం గ్రామసభలను సక్రమంగా నిర్వహించాలి

విశాలాంధ్ర-సీతానగరం : ఉపాధిహామీ పనుల ఆమోదం కోసం ప్రతి గ్రామ పంచాయతీలో శుక్రవారం గ్రామసభలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం సక్రమంగా నిర్వహించాలని ఈఓపిఆర్డీ కుమార్ వర్మ తెలిపారు. సర్పంచులు అధ్యక్షతన నిర్వహించే గ్రామ సభల్లో అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని తెలిపారు. 35 గ్రామ పంచాయతీల కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. రాష్ట్ర ఉప-ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందున అన్ని అంశాలపై ప్రత్యేకదృష్టి సారించాలని ఆయన కోరారు.గ్రామసభల్లో గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు కూడా పాల్గొనేలా బాధ్యత తీసుకోవాలన్నారు. గ్రామసభలకు మండలశాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు. క్లస్టర్ వారిగా ప్రత్యేక అధికారులను నియమించడం పంచాయతీలవారీగా కూడా అధికారులు నియమించమన్నారు. గ్రామసభల కార్యక్రమాలన్నీ వీడియోగ్రఫీ చేయాలని, ఎక్కడ ఎలాంటి పొరపాటు జరగకుండా, సభలు సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. ఉపాధిహామీలో ప్రస్తుతం జరుగుతున్న పనులను, భవిష్యతులో చేపట్టబోయే పనులను కూడా తెలియజేయాలని తెలిపారు. వ్యవసాయ అనుబంధంగా జరిగే పనులకు, ఉద్యానవనాలకు ప్రాధాన్యత నివ్వాలని తెలిపారు. గ్రామ స్థాయిలో సంబంధిత సిబ్బంది అందరూ విధిగా పాల్గొనాలని ఆయన ఆదేశించారు.

దుంబ్రిగుడ : మండలంలోని కొల్లాపూటు గ్రామపంచాయతీ కేంద్రంలో బూ



సివలస సచివాలయం కేంద్రం ఆవరణలో శుక్రవారం జరిగే గ్రామసభను పంచాయితీ పరిధిగల గ్రామాల ప్రజలు, వార్డు సభ్యులు, డోక్రా మహిళా సభ్యులు, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ మెట్లు, సిహెచ్ డబ్ల్యూ, అంగన్వాడి కార్యకర్తలు, యువతి యువకులు అందరూ గ్రామసభలో భాగస్వామ్యం కావాలని నేచర్ సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్స్ సింహాచలం, కస్తూరి కావ్య పలు గ్రామాలకు సందర్శించి అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 13,326 గ్రామ పంచాయతీలకు ఒకే రోజున గ్రామ సభలు నిర్వహించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారని చెప్పారు. గ్రామ సభలో నిర్వహణలో భాగంగా మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం 2023- 24 ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామాల్లో చేపట్టినటువంటి పనుల పురోగతిని ఉన్న పనులను అధికారులు గ్రామసభలో చదివి ప్రజలకు వివరిస్తానన్నారు. సంబంధించి కొత్త పనులు గుర్తించి వాటి అమలు కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సంబంధిత అధికారులకు పంపనున్నారని గ్రామ ప్రజలకు వివరించారు. ఈ గ్రామసభలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ యూత్ తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లి : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన గ్రామ సభలను విజయవంతం చేయాలని జనసేన పార్టీ చింతపల్లి మండల అధ్యక్షుడు వంతల బుజ్జిబాబు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ శుక్రవారం నుండి ప్రారంభించనున్న గ్రామసభలను అన్ని గ్రామ పంచాయతీలలో విజయవంతం చేయాలన్నారు. గ్రామసభలలో ఆయా మండల ప్రత్యేక అధికారులు గ్రామ సదస్సులో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామంలో ప్రజాస్వామ్య పద్ధతిలో గ్రామసభలు నిర్వహించి గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. గ్రామ సభలకు అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, సామాజిక బాధ్యత వహించే ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. రాష్ట్ర అభివృద్ధికి గ్రామాలే పట్టుకొమ్మలని నమ్మిన రాష్ట్ర ప్రభుత్వం గ్రామసభల ద్వారా గ్రామాలలో అవసరాలను గుర్తించడం, అందుకు తగ్గ అభివృద్ధి పనుల నిర్వహణ కోసం ప్రణాళికలు రూపొందించుకొని గ్రామస్తుల సమక్షంలో ఆమోదించడం జరుగుతుందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే అభివృద్ధి పనుల గుర్తింపు ప్రణాళికల ప్రక్రియను రూపొందించుకునేందుకు సర్పంచ్ ల అధ్యక్షతన ప్రతి గ్రామ పంచాయతీలలో గ్రామసభలను నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. గ్రామపంచాయతీలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో మౌలిక సదుపాయాలను కల్పించుకునే ఉద్దేశంతో గ్రామంలో ప్రతి కుటుంబానికి 100 రోజుల ఉపాధి హామీ పనిని కల్పించడంపై గ్రామసభలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. గ్రామాల్లో కనీస సదుపాయాల్లో భాగంగా.. ప్రతి ఇంటికి త్రాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా పనులు చేపట్టాలని, మరుగుదొడ్లు, విద్యుత్, వంటగ్యాస్ కనెక్షన్ సదుపాయాలు, మురుగు కాలువలు, సిమెంటు రహదారులు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ నిర్వహణతోపాటు పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, ఆసుపత్రి సదుపాయాలను కల్పించేలా చూడాల్సి ఉందన్నారు. గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా సిమెంటు రహదారులు, మురుగు కాలువలు, పశువుల షెడ్లు, మినీ గోకులాల నిర్మాణాలు చేపట్టడం కోసం ప్రణాళికలు రూపొందించుకోవడం ముఖ్య ఉద్దేశం అన్నారు. జీవనాధారం అయిన నీటిని బావి తరాలకు అందేలా పొదుపు చేసుకోవాలని, అక్టోబర్ 2 నుండి ప్రారంభం కానున్న నూతన గృహ నిర్మాణాల్లో ప్రతి ఇంటికి కచ్చితంగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఆయా గ్రామసభలలో, సీజనల్ వ్యాధులు, వ్యాక్సినేషన్, పశువులకు వైద్య చికిత్సలు, పశు సంపద సంరక్షణ పట్ల ప్రజలకు అవగాహన పెంచే కార్యక్రమాలతో ప్రతి గ్రామంలో ప్రజాస్వామ్య పద్ధతిలో గ్రామసభలు నిర్వహించి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించు కోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామ సభలు నిర్వహించాలని, వాటిలో ప్రజలందరినీ భాగస్వాములను చేసి గ్రామ సమస్యలపై సమిష్టి నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కోరారు.

నేడు సామూహిక ఉచిత కుంకుమ పూజలు

విశాలాంధ్ర-మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలం శంబర గ్రామంలో గోముకి నది తీరమున వెలిసిన ఉత్తరాంధ్ర ఇలవేల్పు ఉత్తరాంధ్ర గిరిజన ఆరాధ్య దేవత శ్రీ పోలమాంబ అమ్మవారి ఆలయం చదురుగుడి నందు స్వస్తిశ్రీ క్రోధి నామ సంవత్సరం శ్రావణమాసం సందర్భంగా తే 23-08-2024 దిన 3వ శుక్రవారం సామూహిక ఉచిత కుంకుమ పూజలు ఉదయం 9-00 గంటలకు ప్రముఖ ఋత్విక్కులచే జరుపబడును. కావున భక్తులు, స్త్రీలు అందరూ కుంకుమ పూజా కార్యక్రమం జరుగును ఈ కార్యక్రమంలో భక్తులు శ్రీ పోలమాంబ అమ్మవారి దివ్య ఆశీస్సులు పొంది తీర్ధ ప్రసాదములు స్వీకరించ కోరుచున్నాము. పూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు శ్రీ అమ్మవారి పసుపు, కుంకుమ, గాజులు, తమలపాకులు వగైరా పూజ సామాగ్రి దేవస్థానము నుండి ఇవ్వబడును పూజలో పాల్గొను భక్తులు కలశం, కొబ్బరికాయ, ఆచమనపాత్ర, పూలు, అమ్మవారికి నైవేద్యం వగైరా తీసుకొని రాగలరు.

కొత్తూరులో పొలం బడి



విశాలాంధ్ర-కురుపాం : మండలంలోని కొండబారిడి (యూనిట్) మొండెంఖల్లురైతు భరోసా కేంద్రం పరిధిలోగల కొత్తూరు గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాఖ మరియు ఏపిసిఎన్ఎఫ్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో వరి వేసిన పొలంలో శత్రుపురుగులు, మిత్ర పురుగులు సంఖ్యబలం తెలుసుకోవడం వలన పంటపైన తగుజాగ్రత్తలు తీసుకోవడం గట్లమీద బంతి, కంది, నాటించడం, రంగు పళ్ళాలు, లింగాకర్షక బుట్టలు వేయించడం, కషాయాలు తయారు చేయించడం, పక్షి స్థావరాలు వేయించడం రైతులు మంచి దిగుబడులు ఆశించగలరు ఈ పొలం బడి ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమానికి మొండెం ఖల్ అర్బికె విఎఎ సాయిప్రభ, ఎపిసిఎన్ఎఫ్ మండలం ఇన్చార్జి నరేష్, రైన్ ఫారెస్ట్ మేనేజ్మెంట్ కోఆర్డినేటర్ మణికుమార్, ఐసిఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

మొక్కలు నాటండి... పర్యావరణాన్ని కాపాడండి

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీపీ కారం లక్ష్మి అన్నారు. ప్రధానమంత్రి మోడీ ఆదేశాల మేరకు అమ్మ పేరుతోబుధవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ కారం లక్ష్మి స్థానిక సర్పంచ్ సరోజిని చేతులమీదుగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గృహం పక్కన మొక్కలు నాటాలని కాలుష్యం నివారణ తగ్గించాలని చెట్లు నరకడం వలన కాలుష్యం ఎక్కువగా పెరుగుతుందని వర్షాలు సకాలంలో పడటం లేదని వైరస్ బలపడే ప్రమాదం కూడా ఉందని అందరూ వాళ్ళ గృహం ముందు మొక్కలు నాటాలని కాలుష్యం తగ్గించే అవకాశం ఉంటుందని ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని వ్యవసాయ భూములలో ప్లాస్టిక్ వస్తువులు బాటిల్స్ పడేయ వద్దని దానివల్ల భూమి సారాంశం తగ్గుతుందని వారన్నారు ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూణెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, జి లక్ష్మణరావు, కే.సత్యనారాయణ, తాత బాబురెడ్డి, అందరు అధికారులు ప్రజాప్రతి నిధులు పంచాయతీ కార్యదర్శి లు మరియు ఉపాధి హామీ సిబ్బంది ఎంపీడీవో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు

విశాలాంధ్ర-ఎటపాక : అల్లూరి సీతారామరాజు జిల్లా, చింతూరు సబ్ డివిజన్ పోలీస్ పరిధిలోని ఎటపాక సర్కిల్‌లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని ఎటపాక నూతన సిఐ ఎం.కన్నపరాజు హెచ్చరించారు. ఎటపాక పోలీస్ స్టేషన్‌లో గురువారం సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎటపాక డివిజన్ పరిధిలో కోడి పందేలు, పేకాట, గంజాయి రవాణాకు ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటానని సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం.కన్నపరాజు అన్నారు.

జూనియర్ డాక్టర్ హత్యాచార ఘటనపై అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ

విశాలాంధ్ర :మారేడుమిల్లి : కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్ మౌమితపై జరిగిన అమానుష సంఘటనను వ్యతిరేకిస్తూ దోషులను కఠినంగా శిక్షించాలని మారేడుమిల్లి స్థానిక పోలీస్ స్టేషన్ సెంటర్లో కుల, మత రాజకీయాలకతీతంగా అన్ని రాజకీయ పార్టీలు సామాన్య ప్రజలు యువత భారీ ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. ముందుగా ట్రైనీ డాక్టర్ మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ట్రైనీ డాక్టర్‌కి న్యాయంచే యాలంటూ నినాదాలతో హెూరెత్తించారు..ఈ సందర్భంగా పలు రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 78 ఏళ్లు గడుస్తున్నఇప్పటికి మహిళలకు రక్షణ కరువైందని ప్రభుత్వాల తీరుపై విమర్శలు గుప్పించారు.. ఆనాడు మహిళలు ఒంటరిగా రోడ్డుపై నడిచినప్పుడే మనకు పూర్తి స్వతంత్రం వచ్చిందని గాంధీ అన్నారని, కానీ నేటి సమాజంలో ఇలాంటి దారుణమైన సంఘటనలు చోటు చేసుకుంటుంటే మహిళలకు రక్షణ కరువైందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకు మహిళలపై భిన్నంగా, చిన్నారులపై అనేక ఆకృత్యాలు అరాచకాలు నేటికీ జరగడం వాటిని అరికట్టడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని మండిపడ్డారు. న్యాయం కొంతమందికే పరిమితమైందని కఠిన చట్టాలు అమలు చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతుందని న్యాయస్థానాలు ఇలాంటి వాటిని వెంటనే కఠిన చర్యలు తీసుకొని శిక్షలు అమలు అయ్యేలా చూడాలి అన్నారు. ఇలాంటి సంఘటనలు జరగడం మానవ మనుగడకే సిగ్గుచేటని విమర్శించారు.. సంఘటన జరిగి రోజులు గడుస్తున్న నేటికీ ముద్దాయిలను పట్టుకోవడంలో ఆయా ప్రభుత్వాలు విఫలం కావడంపై ఘాటుగా విమర్శలు గుప్పించారు. మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చి న్యాయం వెంటనే అమలు జరిగేలా న్యాయస్థానాలు చర్యలు చేపట్టాలన్నారు. సమాజంలో యువత చెడు మార్గాల్లో నడవకుండా ఉండాలంటే తల్లిదండ్రులు కూడా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. పిల్లలకు సమాజంలో ఎలా మెలగాలనేది తల్లిదండ్రులు నేర్పించాలన్నారు.యువత మత్తుకు దూరంగా ఉండాలన్నారు. ప్రతి స్త్రీ ఒక చెల్లి తల్లిలా భావించాలని అప్పుడే ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉంటాయని పలువురు నాయకులు మాట్లాడారు. అనంతరం ర్యాలీగా మారేడుమిల్లి ఎమ్మార్వో కార్యాలయానికి వెళ్లి తహసిల్దార్ కు ముద్దాయిలకు కఠిన చర్యలు అమలయ్యేలాగా చర్యలు తీసుకోవాలని వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కే జాకోబ్ జడ్పిటిసి బాలాజీ బాబు, వైస్ ఎంపీపీ ఎల్ రవికుమార్ ఆదివాసి నాయకుడు జి నారాయణరావు, ఉప సర్పంచ్ బి.వీరబాబు, మాజీ జెడ్పిటిసి ఎస్.సత్యనారాయణ రెడ్డి, టిడిపి మాజీ మండలాధ్యక్షుడు బి. అప్పాజీ, జనసేన మండల అధ్యక్షుడు ఎం.దుర్గాప్రసాద్, మాజీ ఎంపీపీ ఎస్ సుభాన్, పలు పార్టీల రాజకీయ నాయకులు, మారేడుమిల్లి యువత, పలువురు పాల్గొన్నారు.

ఎంపిడిఓగా రత్నకుమారి

వైసిపీలో చక్రం తిప్పిన కుమారి

విశాలాంధ్ర-దేవీపట్నం : దేవీపట్నం ఎంపిడిఓగా రత్నకుమారి పదవీ బాధ్యతలు బుధవారం చేపట్టారు. గత సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తహసీల్దార్ లను ఎంపిడిఓ లను గతంలో బదిలీలు చేపట్టిన విషయం తెలిసిందే. తదనంతరం వేరే ఎంపిడిఓ కూడా వచ్చి వెళ్లారు. వేరే చోట పనిచేస్తూ గత వైసిపీ ప్రభుత్వం లో వైసిపీ నాయకులతో కలిసి వైసిపీ ప్రజా ప్రతినిధిలా వైసిపీ కోవర్ట్ లా అంతా తానై చక్రం తిప్పిన సంగతి అందరికీ తెలిసిందే. అప్పట్లో టిడిపి సంభందించిన ఏ ఒక్కరికి సముచిత స్థానం గానీ కనీస గౌరవం కానీ ఇవ్వని ఎంపిడిఓ ను తెలుగుదేశం పార్టీలోని ఒక వర్గం ఎక్కడో ఉన్న ఆమెను కావాలని పైరవీలు చేసి రప్పించుకోవటంలో బహాటంగా పలు విమర్శలు విన్పిస్తున్నాయి. గతంలో కొన్ని అవినీతి అవకతవకలు కూడా జరిగి అపవాది ని మూటగట్టుకొని వెళ్లిందనే విమర్శలు కూడా అప్పట్లో విన్పించాయి. అటువంటి ఎంపిడిఓ ను తిరిగి ఇదే మండలానికి తిరిగి తీసుకు రావటంలో ఎంత చేతులు మారాయని పలువురు విమర్శలు చేస్తున్నారు . ఈ వ్యవహారం లో ఎవ్వరికి ఎంత లాభం అనేది డాలర్ల ప్రశ్నగా మారింది. ఇదంతా చూస్తుంటే పాత సీసాలో కొత్త సారా లా ఉంది ఈ వ్యవహారం. ఆమె బదిలీ వెనుక తెలుగు తమ్ముళ్లు కు ఎంపిడిఓ భారీగా చేతులు తడిపినట్టు విమర్శలు విన్పిస్తున్నాయి. గత ప్రభుత్వం హయాంలో సంస్థాగత పదవుల్లో వైసిపీ పార్టీ నుంచి పదవులు చేపడుతున్న నాయకులు ఇంకా పదవుల్లో ఉండగా ఈమె ఎవ్వరికి విధేయులుగా పనిచేస్తారు అనేది ప్రశ్నర్ధకం. ఏమి ఆశించి ఏరి కోరి ఆమెను తిరిగి ఇదే స్థానానికి ఎంపిడిఓగా బదిలీపై తీసుకొచ్చారు అని జనం గుసగుసలాడుకుంటున్నారు. ఈ వ్యవహారం దగ్గర నుంచి చూస్తున్న తెలుగు తమ్ముళ్ల లోని ఒక వర్గం బహాటంగా సొంత పార్టీపైనే గుర్రుగా ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వం హయాంలో పాలక పక్ష నేతలతో అంట కాగిన నేతలను పార్టీ అధిష్టానం ఎలిమినేట్ చేస్తుంటే అంతా చూసిన టిడిపి మండల నాయకులు గత ఎంపిడిఓ ను మళ్ళీమండలానికి రప్పించటంలో ఆంతర్యం ఏంటనిది లోగుట్టు పెరుమాళ్ళ కె ఎరుక అన్న చందం గా మారింది. ఇదంతా చూస్తుంటే మండలంలో వైసిపీ టిడిపి కలసి కట్టుగా పనిచేయాలని కృత నిశ్చయంతో ఉన్నట్టు తెలుస్తుంది. ఇప్పటికే అక్కడక్కడా గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న కోడి పందెలలో రెండు పార్టీలు కలసి పనిచేస్తున్నాయి. ఇప్పటికైనా టిడిపి నియోజకవర్గం నాయకులు మండలాలల్లో జరుగుతున్న వ్యవహారాలపై దృష్టి సారించాలని టిడిపి లోని ఒక వర్గం తెలుగు తమ్ముళ్లు కోరుతున్నారు.

జన సైనికులు గ్రామసభల్లో పాల్గొనాలి

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : జనసేనపార్టీ అధ్యక్షులు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బాధ్యత వహిస్తున్న పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించబోతున్నారని, జన సైనికులు గ్రామసభల్లో పాల్గొనాలని గురువారం ఆ పార్టీ మండల అధ్యక్షులు ములకాల సాయికృష్ణ పిలుపునిచ్చారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి గ్రామసభలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని పవన్‌కల్యాణ్ అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గం మైసూరావారి పల్లెలో పాల్గొంటున్నారని మన పార్టీ నాయకులు, శ్రేణులు సైతం టిడిపి, బీజేపీ నాయకులు, శ్రేణులతో సమన్వయం చేసుకొని ప్రతీ జనసైనికులు నాయకులు గ్రామ సభల్లో పాల్గొనాలని ఉపాధి హామీ పనులు ఆమోదం కోసం ఏర్పాటు చేసే సభలను విజయవంతం చేయాలని ఉపాధి హామీ పథకం పరిధిలో 46 రకాల పనులు చేయవచ్చని మీ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్నటువంటి సమస్యలను ఆ గ్రామసభలో చర్చించదానికి అవకాశం ఉందని,ఏ గ్రామ పంచాయతీలో ఓటు హక్కు ఉంటుందో ఆ పంచాయతీ గ్రామ సభలో పాల్గొనాలని గ్రామ సభలు విజయవంతం అయ్యేలాచూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శులు బాగుల అంజనరావు,కెచ్చల పోషి రెడ్డి, యూత్ నాయకులు పెదపెట్ల పవన్ కళ్యాణ్, కోట్ల సాయిబాబు, గోల్కొండ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

జీకే వీధి : మండలంలోని మొండిగడ్డ, జర్రీల పంచాయతీలలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం 10గంటల నుండి పంచాయతీలో జాతీయ ఉపాధి హామీ పథకం పై జరుగు గ్రామసభకు ప్రతి గ్రామ సమస్యలపై దరఖాస్తులు తీసుకొని రావాలని సర్పంచ్ అడపా ప్రియాంక కోరారు. ప్రభుత్వానికి సమస్యలపై ప్రతిపాదనలు పెట్టవలసి ఉంటుందనీ, పంచాయతీలోనీ అన్ని శాఖలవారు, ఎంపీటీసీ, వైస్ సర్పంచ్, కూటమి నాయకులు వివిధ పార్టీ నాయకులు విధిగా హాజరుకావాలని కోరారు.

నేడు 451 గ్రామ పంచాయతీలో గ్రామ సభలు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

తక్కువ ధరకు ఇసుక అందించుటకు చర్యలు

విలేకరుల సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

విశాలాంధ్ర-పార్వతీపురం : నేడు జిల్లా వ్యాప్తంగా 4501 గ్రామపంచాయతీలలో ఉపాధి హామీ పథకం గ్రామసభలు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత ఇసుక సరఫరా పథకంలో భాగంగా ప్రజలకు తక్కువ ధరకు వేగవంతంగా ఇసుక అందించుటకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టరు ఎ. శ్యామ్ ప్రసాద్ తెలిపారు.గురువారం సాయంత్రం కలెక్టరు కార్యాలయ సమావేశమందిరంలో పత్రికావిలేఖరుల సమావేశంను జిల్లా కలెక్టర్ నిర్వహించి జిల్లాలో అమలుచేస్తున్న కార్యక్రమాలను వివరించారు. భామిని మండలంలో గల కాట్రగడ్డ ఇసుకర్యాంపు నుండి ఇసుక తీయుటకు కావలసిన అనుమతులు మంజూరయ్యాయని తెలిపారు. ఉచిత ఇసుక పాలసీలో భాగంగా ఇసుక తీయుచార్జీలు, రవాణాచార్జీలు మాత్రమే వసూలు చేసి ఇసుక అందించడం జరుగుతుందని తెలిపారు. ఇసుకను అనుమతి లేకుండా అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోబడతాయన్నారు. చార్జీలు కూడా సాధ్యమైనంత తక్కువగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా స్థాయి ఇసుక కమిటీని ఆదేశించినట్లు తెలిపారు. 10 కి.మీ., 25 కి.మీ. వరకు స్థిర చార్జీలు నిర్ణయించబడతాయని, తదుపరి దూరాన్ని బట్టి కి.మీ. వారీగా చార్జీలు చెల్లించవలసిఉంటుదన్నారు. మెట్రిక్ టన్నుకు కనీస ధర 400 రూపాయలు లోపుగా ఉండేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్టాకు పాయింటు వద్ద బుకింగు కార్యాలయం ఏర్పాటుచేసి, స్లాటు కేటాయిస్తారని, ఆ సమయంలో మాత్రమే వాహనం ఇసుక పొందవలసిఉంటున్నారు. స్టాకు పాయింటు వద్ద పోలీసు పోస్టు, సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని, స్టాకు సంబంధించి పూర్తి రికార్డులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. పి.ఎం జన్ మాన్ కార్యక్రమంలో భాగంగా ప్రిమిటివ్ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్ (పివిటిజి)ల సమీకృత అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు జిల్లా కలెక్టరు తెలిపారు. తాగునీరు, విద్య, ఆరోగ్యం, గృహాల కల్పన శత శాతం కల్పించుట లక్ష్యంగా, వారి సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ జీవన ప్రమాణాలలో మంచి మార్పులు తీసుకువచ్చుటకు కుటుంబం యూనిట్‌గా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. రహదారులు అనుసంధానం కాని గిరిజన ఆవాసాలకు రహదారులు నిర్మాణానికి ప్రతిపాదనలు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు వైద్యఆరోగ్యశాఖమంత్రి జిల్లాకు రాక: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ శుక్రవారం జిల్లా పర్యటనకు వస్తున్నారని జిల్లా కలెక్టరు శ్యామ్ ప్రసాద్ తెలిపారు.శుక్రవారం నాడు మంత్రి సత్యకుమార్ సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తారని, అనంతరం సూరంపేటగ్రామ పంచాయతీలోని మరిపివలస గ్రామం సందర్శన చేసి అక్కడ హరిజన గిరిజన లబ్ధిదారులతో మాట్లాడతారని తెలిపారు.అనంతరం జిల్లా ఆసుపత్రి సందర్శించి వైద్య ఆరోగ్య శాఖ సమీక్షలో పాల్గొంటారని చెప్పారు.

పెట్రోల్ విక్రయాలపై సోషల్ మీడియా చేస్తున్న ప్రచారం వాస్తవ విరుద్ధం

కల్తీ పెట్రోల్ అంటూ సోషల్ మీడియా ప్రచారాలపై పోలీసులకు ఫిర్యాదు

బంక్ సూపరింటెండెంట్ రామకృష్ణ

విశాలాంధ్ర-చింతపల్లి : గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంకులో పెట్రోల్, డీజిల్ విక్రయాలలో నాణ్యత లోపిస్తుందని, కల్తీ జరుగుతుందని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం అవాస్తవమని పెట్రోల్ బంక్ సూపరింటెండెంట్ బి రామకృష్ణ అన్నారు. గురువారం బంక్ వద్ద పెట్రోల్ నాణ్యత పరీక్షలు నిర్వహించి వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పెట్రోల్ బంక్ ఎకరాయాలను తగ్గించాలనే ఉద్దేశంతో కొంతమంది వ్యక్తులు సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అసత్యం అన్నారు. ఇప్పటివరకు వినియోగదారుల నుంచి తమకు ఎటువంటి ఫిర్యాదులు అందలేదన్నారు. వినియోగదారులు ఎవరైనా పెట్రోల్, డీజిల్ నాణ్యతలను పరీక్షించుకునే అవకాశం ఉందన్నారు. గిరిజన సహకార సంస్థ సేవా దృక్పథంతో మాత్రమే పని చేస్తుందని, వినియోగదారులకు నాణ్యమైన పెట్రోల్, డీజిల్ అందించడమే తమ లక్ష్యం అన్నారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఏ ఒక్కరు నమ్మరాదని, సోషల్ మీడియాలో ప్రచారం చేసిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని ఆయన తెలిపారు. పోలీస్ శాఖ సహకారంతో ప్రచారం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

ముడుపుల పూజలకు పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర-సీతానగరం : మండలకేంద్రంలో ఉన్న శ్రీలక్ష్మినరసింహస్వామిఆలయంలో గురువారం జరిగిన ముడుపుల పూజలకు అనూహ్య స్పందన లభించింది. వర్షం పడిన శ్రావణమాసం కావడంతో పెద్ద ఎత్తున వివిధ ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుండే ముడుపుల పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు పీసపాటి శ్రీనివాసాచార్యులు, రామానుజాచార్యులు, ఆమంచి శ్రీనివాసాచార్యులు, కె.మురారి, బృందావనం ఉదయ కృష్ణమాచార్యులు, పవన్ కళ్యాణ్ ఆచార్యులు, మనోజ్ వంశీ కృష్ణమాచార్యులు తెలిపారు. బ్యాచుల వారీగా పూజలను నిర్వహించడంతో పాటు భక్తులుతెచ్చిన వివిధ రకాల పూలదండలు, పూలు స్వామివారిని పెద్దఎత్తున అలంకరించిన తీరు అందరిని ఆకట్టుకుంది. ప్రతీగురువారం శ్రీలక్ష్మి నరసింహస్వామీ దేవాలయంలోజరుగుతున్న ముడుపుల పూజలకు పాతభక్తులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి కొత్త భక్తులు రాకతో అనూహ్య స్పందన వస్తుందని తోటి భక్తులు తెలిపారు. వివిధ ప్రాంతాలనుండి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు భక్తిశ్రద్ధలతో, ఉపవాసాలతో స్వామివారికి పూజలు చేసి, స్వామివారు ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నారు. నిర్మలమైన మనస్సుతో పాల్గొని పూజలుచేస్తూ 27సార్లు ప్రదక్షిణలను పూర్తిచేసి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి తరలి వెళు న్నారు. తొమ్మిది వారాలపాటు ముడుపులు పూజలు చేయడంతో భక్తులకు మానసిక ప్రశాంతత, మంచి కలుగుతుందని పలువురు తెలియజేయడం గమనారం.

ఆశ్రమ పాఠశాలలో బేటి బచావో, బేటి పడావో కార్యక్రమం

విశాలాంధ్ర-గంగవరం : స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బేటి బచావో, బేటి పడవ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సిడిపిఓ లక్ష్మీ మాట్లాడుతూ బేటి బచావో,బేటి పడావో గురించి 100 రోజుల మిషన్ శక్తి ప్రోగ్రాంలో భాగంగా పదవ తరగతి, ఆరవ తరగతి పిల్లలకు అవగాహన కల్ నిర్వహించారు.ఈ సందర్భంగా పిల్లలకు వారి హక్కులు, చట్టాలు గురించి పిఓసిఎస్ఓ బాల్యవివహాల గురించి వాటివల్ల జరిగే పరిణామాల గురించి అవగాహన కల్పించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్స్, పోషకాహారం ఆరోగ్యం గురించి, రక్తహీనత వల్ల కలిగే పరిణామాలు, గురించి వివరించారు.. పిల్లలకు రుతుక్రమ సమయంలో పరిశుభ్రత గురించి వివరించి వివరించారు. ఈ సందర్భంగా పిల్లలతో మానవహారంనిర్వహించారు. అనంతరం పిల్లలకు వంట చేసే ప్రదేశం, బాత్రూమ్ లు పరిశుభ్రంగా ఉన్నాయా లేదా అని పరిశీలించి, పిల్లలకు మెనూ ప్రకారంగా పెడుతున్నారా లేదా అని పిల్లలను, టీచర్స్ ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ ఐ.రాంబాబు, ఐసిడిఎస్ పరువైజర్ టీ.సత్యవతి, హెల్త్ సూపర్వైజర్ రత్నం ,స్కూల్ టీచర్ ఉమా దేవి, మహిళా సంరక్షణ కార్యదర్శులు కె. గంగాభవాని, విజయకుమారి, విక్టోరియా స్వాతి, కుమారి, మంజుల, అంగన్వాడీ కార్యకర్తలు లక్ష్మి సుజాత, కటాక్షం, ఏఎన్ఎం పద్మప్రియ హాజరయ్యారు.

పలు సమస్యలపై నూతన తహసిల్దార్‌కి బిజెపి నాయకుల వినతి

విశాలాంధ్ర-గంగవరం : నూతనంగా బాధ్యతలు తీసుకున్న తహసిల్దార్ శ్రీనివాసరావును బిజెపి నాయకులు గురువారం కలిశారు. సందర్భంగా మండల అధ్యక్షుడు సారపు పోతురాజు దొర మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో 10 ఎకరాలు మించి ఉన్న ప్రతి రైతుకు తెల్ల రేషన్ కార్డ్, పెన్షన్ ప్రభుత్వ పథకాలు అందకుండా పోయాయని తాసిల్దార్ కు విన్నవించారు. ఏజెన్సీ ప్రాంతంలో రైతుకు 20 ఎకరాలు ఉన్నఉపయోగముండదని అతను కూలితో సమానమని వర్షాలతోనే జీవధారణమని, వర్షంపడితేనే పంట పండుతుందని లేకపోతే కూలీ తోనే సమానమని తాసిల్దార్ కు తెలియజేశారు. మీరు ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి ఏజెన్సీ ప్రాంతంలో ఉన్నటువంటి రైతులకు సడలింపు చేయాలని తిరిగి రేషన్ కార్డులు పెన్షన్ రైతులకు తిరిగి ఇచ్చి న్యాయం చేయాలని ఆయన కోరారు. అనంతరం తాసిల్దార్ కు భాజపా నాయకులు మెమొరండా సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మేడా శెట్టి సూర్యచంద్ర,ఎస్టి మోర్చా ప్రధాన కార్యదర్శి కుంజం వెంకటేశ్వర్లు దొర, మండల ఉపాధ్యక్షురాలు పుట్టపల్లి నీలాలమ్మ, కార్యదర్శి సారపు పాపారావుదొర, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షులు బొజ్జపు చిన్నాల దొర, బిజెపి సీనియర్ నాయకులు కుంజం చిన్నలురావు, బిజెపి బూత్ ఇంచార్జ్ అన్నిక శివ, భారతి, విద్య కమిటీ చైర్మన్ అన్నిక వెంకటలక్ష్మి, టిడిపి ఆముదాలబంధ ఎంపీటీసీ పండ ఆదినారాయణతదితరులు పాల్గొన్నారు.

ప్రతిభను వెలికి తీయడమే పోటీల సారాంశం

ఘనంగా ప్రారంభమైన క్రీడా పోటీలు

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యురాలు విజయభారతి

విశాలాంధ్ర-చింతపల్లి :ఈనెల 29న స్పోర్ట్స్ డే ను పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో క్రీడా పోటీలను ఆ కళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ ఎం విజయభారతి ప్రారంభించారు. గ్రామంలోని వివిధ కళాశాలలు, పాఠశాలల పిఈటిల ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణలు పొందిన క్రీడాకారులు, విద్యార్థినీ, విద్యార్థులు ఈ పోటీలలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నేషనల్ స్పోర్ట్స్ డే, నేషనల్ స్పేస్ డే లను పురస్కరించుకొని క్రీడా పోటీలతోపాటు, సైన్స్ ఫేర్, క్విజ్ తదితర పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. వివిధ కళాశాలలో పాఠశాలలో నుంచి వచ్చిన విద్యార్థిని, విద్యార్థులు ఈ పోటీలలో తమ ప్రతిభను ప్రదర్శించనున్నారన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులతో పాటు, వివిధ కళాశాలలు పాఠశాలల నుంచి వచ్చిన ప్రధానాచార్యులు, ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు, విద్యార్థినీ, విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాం

విశాలాంధ్ర-ముంచింగ్‌పుట్టు : అల్లూరి జిల్లా ముంచింగిపుట్టు మండల కేంద్రంలో గల ట్రాఫిక్ సమస్యపై మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో స్థానిక ఆటో, జీపు యజమానులు, డ్రైవర్లతో పాటు స్థానిక వర్తకులతో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించామని ఎస్సై కే.రవీంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ కె.రవీంద్ర మాట్లాడుతూ వాహనదారు లందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రహదారికి అడ్డంగా వాహనాలు నిలుపుదల చేయరాదని అన్నారు. మండల కేంద్రంలో నిలుపుదల చేసే వాహనాలు ఖచ్చితంగా రహదారికి ఎడమ వైపున నిలుపుదల చేయలన్నారు. జోలాపుట్టు వైపు ఆటోలు స్కూల్ ఎదురుగా, పెదబయలు, పెదగూడ వైపు నుంచి వచ్చే వాహనాలు పోలీసు స్టేషన్ కూడలి ఎదురుగా, బూసిపుట్టు, కుమడ, రూడకోట వైపు నుంచి వచ్చే వాహనాలు జిసిసి గోదాము ఎదురుగా ఖాళీ స్థలంలో, సుజనకోట వైపు నుంచి వచ్చే వాహనాలు దుర్గమ్మతల్లి ఆలయం నుంచి జిటీడబ్ల్యూ బాలికల-1 పాఠశాల వరకు వరుస క్రమంలో ఎడమవైపున నిలుపుదల చేయాలని ఆయన సూచించారు. అలాగే ద్విచక్రవాహనదారులు సైతం దుకాణాల ఎదుట అడ్డదిడ్డంగా గంటల తరబడి నిలుపుదల చేయారదన్నారు. ఈ నిబంధనలు ఖచ్చితంగా వాహనదారులు పాటించాలని లేనిపక్షంలో అటువంటి వారిపై జరిమానతో పాటు కఠిన చర్యలు తప్పవన ఎస్ఐ కె.రవీంద్ర హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షుడు ఎస్.ప్రసన్నకుమార్, వర్తకులు, ఆటో, జీపుల యాజమానిలు, డ్రైవర్లు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్

విశాలాంధ్ర-గంగవరం : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. 1237 పనులను చేపట్టగా 13 కోట్ల 31 వేల 521 ఖర్చు చేశారు. 41, మెటీరియల్ కాంపోనెంట్ క్రింద 41,26,526 రూపాయలు ఖర్చు చేసినట్లు తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 12 22 పనులను, ఐటీడీఏ ద్వారా ఆరు పనులను, పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఏడు పనులను, సర్వ శిక్ష అభియాన్ ద్వారా రెండు పనులను చేపట్టారు. మస్టర్ల లో జరిగిన అవకతవులకు 6000 రూపాయలు ఫైన్ విధించడం జరిగిందని తెలిపారు. ఎం బుక్కులో తప్పులకు గాను 27, వేల 176 ఫైన్ గా విధించారు.ఈ సందర్భంగా 14,250 రికవరీ చేసినట్లు తెలిపారు. కొత్తాడ పంచాయతీరాజ్ శాఖ ఆడిట్ సమయంలో రికార్డులు సమర్పించలేదని తెలిపారు. 14 లక్షల 57 వేల 373 రూపాయల విలువైన పనులను సరి చేయాల్సి ఉంది. సోషల్ ఆడిట్ కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారి, రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, సహాయపదక సంచాలకులు (%ూజూు%) రాంబాబు, మండల పరిషత్ అధ్యక్షులు పల్లాల కృష్ణారెడ్డి, జడ్పిటిసి బేబీ రత్నం, ఎంపీడీవో బి శ్రీనివాసులు, సోషల్ ఆడిట్ ఎస్ ఆర్ పి రాజు

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

విశాలాంధ్ర-వి. ఆర్. పురం : పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత అని ఏఎస్ డిఎస్ సంస్థ అధినేత వి గాంధీబాబు అన్నారు. గురువారం వ్యవసాయక సాంఘిక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గత నెలలో వచ్చిన శబరి గోదావరి నదుల వరదలు , అధిక వర్షాలు కారణంగా మండలం నందు 5 గ్రామాలలో పబ్లిక్ పాయింట్లులో శ్రమదానంతో శుభ్రం చేసే పనులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదలు అధిక వర్షాలు కారణంగా గ్రామాలలోని ముఖ్య ప్రదేశాలలో చెత్త బురద పెరుకుపోవడము వలన సీజనల్ వ్యాధులు ప్రభలుతున్నందున పారిశుధ్య పనులు సంస్థ తరపున చేపట్టడం జరిగినదని. ప్రజల ఆరోగ్య సమస్యలు రాకుండా ముందుజాగ్రతలు తీసుకోవాలని ఆయన తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పేరుతో ఒక మొక్క ద్వారా పర్యావరణ పరిరక్షణ

ఎంపీపీ కృష్ణారెడ్డి

విశాలాంధ్ర-గంగవరం : అమ్మ పేరుతో ఒక మొక్క నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణ చేపట్టవచ్చని ఎంపీపీ కృష్ణారెడ్డి ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమాన్ని లాంచనంగావారు ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మపేరుతో మ్మొక్కలు నాటే కార్యక్రమంలోబాగంగా గృహాలు ముందు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని,కాలుష్యం నివారణ తగ్గించాలని,వృక్షాలు నరకడం వలన కాలుష్యం ఎక్కువగా పెరుగుతుందని అన్నారు. వృక్షాలను నరకడం వల్ల వర్షాలు సకాలంలో పడటం లేదని,వైరస్ బలపడే ప్రమాదం కూడా ఏర్పడుతుందన్నారు. గృహాలు ముందు మొక్కలు నాటాలని, కాలుష్యం తగ్గించే అవకాశం ఉంటుందని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని,ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, వ్యవసాయ భూములలో ప్లాస్టిక్ వస్తువులు బాటిల్స్ పడేయ కూడదని, భూమి సారం తగ్గుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్సి వైద్యాధికారిని డాక్టర్ భావన ,ఉపాధి హామీ పథకం ఏపీఓ ప్రకాష్, వైద్య సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి సాగు విడిచిపెట్టి ఫ్రూట్స్ తదితర వాటిపై దృష్టి పెట్టాలి

విజిలెన్స్ డిప్యూటీ కమిషనర్ మల్లికార్జున్ రావు

విశాలాంధ్ర-ముంచింగిపుట్టు : అల్లూరి జిల్లా మండలంలోని గిరిజన రైతులందరూ పూర్తిస్థాయిలో గంజాయి సాగు విడిచిపెట్టి మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పంపిణీ చేస్తున్న సిల్వర్ జామి నిమ్మ డ్రాగన్ ఫ్రూట్స్ తదితర వాటిపై అవగాహన కలిగి ఉండి ఆర్థికంగా లాభాలు పొందవచ్చని ఎంజీఎన్‌ఆర్‌ఇజిఎస్ విజిలెన్స్ డిప్యూటీ కమిషనర్ మల్లికార్జున్ రావు అన్నారు. గురువారం ఆయన మండలంలో గల వనబసింగి పంచాయతీ లుంగపుట్ గ్రామ సమీపంలో వేసిన హార్టికల్చర్ డ్రాగన్ ఫ్రూట్స్ తోటలను ఆయన పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గల రైతులందరూ సిల్వర్ జామ నిమ్మ డ్రాగన్ ఫ్రూట్స్ కాఫీ మొక్కలను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తుందని దాని ద్వారా పంట వేసుకొని ఆర్థికంగా లాభాలు పొందే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. చట్టానికి వ్యతిరేకమైన గంజాయి సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గుచూపడం ఎంతో ఉత్తమమని ఆయన అన్నారు. రైతులకు కావలసిన విత్తనాలతో పాటు మొక్కలు అన్ని రకాలుగా ప్రభుత్వం పంపిణీ చేస్తుందని ప్రతి గిరిజన రైతు అవగాహన కలిగి ఉండి మొక్కలు పెంచుకోవాలని ఆయన పేర్కొన్నారు. సిల్వర్ చెట్లు పెంచడం ద్వారా కాఫీ, మిరియాలు పంట వేసుకుంటే దానిద్వారా అధిక లాభాలు పొందవచ్చని ప్రతి రైతు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ డి పవన్ ఎంపీడీవో కే కిరణ్ కుమార్ ఏపీవో నాయుడు ప్లాంటేషన్ సూపర్వైజర్ వి రంగారావు ఎంజీఎన్‌ఆర్‌ఇజిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.